కాంట్రాక్టు కార్మికుల వేతన వెతలు

- మూడు నెలలుగా అందని జీతాలు
- గత నెల నుంచి విధులు నిలుపుదల
- గగ్గోలు పెడుతున్న కార్మికులు



జీతాల కోసం ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

ఉక్కునగరం: 'వారు స్టీల్‌ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన నిర్వాసితులు. శాశ్వత ఉపాధి లభించకపోవడంతో కాంట్రాక్టు కార్మికులుగా చేరారు. చాలీ చాలని జీతాలతో జీవిస్తున్నారు. అయితే, ఆ జీతాలు కూడా మూడు నెలలుగా లేకుండా పోయాయి. దీనికి తోడు గత నెల 25 నుంచి విధుల్లోకి తీసుకోవడం లేదు. దీంతో వారి ఆవేదన చెప్పనలవిగా ఉంది.'

వివరాల్లోకి వెళ్తే..

స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో క్లీనింగ్ పనుల నిమిత్తం నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను తీసుకున్నారు. మొత్తం 11 పార్టులుగా ఉన్న ఈ పనుల్లో ఇంజినీరింగ్ షాప్స్, ఎల్ఎంఎం, ఎఫ్ఎండీ, ఆర్ఎంహెచ్‌పీ, ట్రాఫిక్, వాటర్ మేనేజ్‌మెంట్, ఇన్‌స్ట్రుమెంటేషన్, డీఎస్‌డబ్ల్యూ విభాగాలతో కూడిన 8 పనులను ఒక కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. 14 శాతం తక్కువకు కాంట్రాక్టు తీసుకున్న సదరు కాంట్రాక్టర్ వద్ద సుమా రు 140 మంది పని చేస్తుండేవారు. గతేడాది సెప్టెంబర్‌లో పనులు మొదలు పెట్టి అక్టోబర్‌లో వారికి వేతనాలు చెల్లించాడు. నవంబర్ నుంచి వారికి జీతాలు ఎగ్గొట్టడంతో వారు ఆందోళనకు దిగారు. దీంతో ఆయా విభాగాల అధికారులు నవంబర్, డిసెంబర్ నెలలకు జీతాలు చెల్లించే ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి మరలా వారి కష్టాలు ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోవడంతో విభాగాల అధికారులు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేశారు. దీంతో మూడు నెలలుగా వారికి జీతాలు లేకుండా పోయాయి. దీంతో ఉక్కు శ్రామిక సంఘం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారు.

మూడు నెలలుగా పీఎఫ్, ఈఎస్ఐ లేవు

వారికి మూడు నెలలుగా పీఎఫ్, ఈఎస్ఐలు కూడా చెల్లించకపోవడం గమనార్హం. చికిత్స కోసం ఈఎస్ఐకు వెళ్లిన కార్మికులను వెనక్కు పంపడంతో ఈఎస్ఐ చెల్లించని విషయం బయటపడింది. పీఎఫ్, ఈఎస్ఐ లేని కాంట్రాక్టు కార్మికులను పనిలోకి తీసుకుంటే తలెత్తే పరిస్థితులను గమనించి, ఆయా విభాగాల అధికారులు వారిని గత నెల 25 నుంచి విధుల్లోకి తీసుకోవడం మానేశారు. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సదరు కాంట్రాక్టర్‌ను ఆయా విభాగాల అధికారులు టెర్మినేట్ చేశారు. ఇప్పటికే మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న తమను ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

మా కుటుంబాలు ఎలా బతకాలి



మూడు నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు చెల్లించడం లేదు. ఇప్పటికే చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నాం. కుటుంబ నిర్వహణ భారంగా ఉంది. విభాగాల యాజమాన్యాలు రెండు నెలలు చెల్లించారు. ప్రస్తుతం విధులకు రానివ్వక పోవడంతో ఇంట్లో ఉండాల్సి వస్తుంది. మా కుటుంబ పోషణ ఎలా?

– పంచదార్ల అప్పలరాజు, కాంట్రాక్టు కార్మికుడు

అన్ని విభాగాల్లో పనులు ప్రారంభించాలి



కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోతే వారు ఎలా బతుకుతారు? దీనికి తోడు విధుల నుంచి కూడా నిలిపి వేయడం అన్యాయం. ఆ కాంట్రాక్టర్‌ను టెర్మినేట్ చేయడం మాత్రమే కాకుండా అన్ని విభాగాల పనులను ఆయా విభాగాల అధికారుల ఆధ్వర్యంలో ప్రారంభించాలి. ఈ విషయంలో జాప్యం జరిగితే పోరాటం ఉధృతం చేశాం. కొత్త కాంట్రాక్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– బొడ్డు పైడిరాజు, ప్రధాన కార్యదర్శి, ఉక్కు శ్రామిక సంఘం

వైభవంగా పెంటమాంబ అమ్మవారి పండగ



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో పెంటమాంబ అమ్మవారు

పెదగంట్యాడ: నెల్లిముక్కు 14 గ్రామాల ఆరాధ్యదేవత పెంటమాంబ అమ్మవారి పండగను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, పులి లక్ష్మీబాయి, బీజేపీ నాయకుడు కరణం రెడ్డి నరసింగరావు తదితరులు దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బండ్ల వేషాలు, నేలగరిడీలు, తప్పెట గుళ్లు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వర రెడ్డి, గొందేశి సత్యారావు, అప్పలరెడ్డి పాల్గొన్నారు. న్యూపోర్టు సీఐ రాము ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ముస్లింల సేవలు స్ఫూర్తిదాయకం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల సేవలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. స్థానిక అజీమాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. గాజువాక వంటి ప్రాంతాల్లో హిందువులు, ముస్లింలు అన్న తేడా ఉండదని, అందరూ సోదరుల్లా కలిసి మెలసి జీవించడం ఇక్కడి సమైక్యతకు, మత సామరస్యానికి నిదర్శనమన్నారు. ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో 66వ కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ సింహాచలం

కూర్మన్నపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని జోన్–6 జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురం రాజులపాలెంలో స్వచ్ఛ సంకల్పంపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను ప్రజలు ఇంటి వద్దనే వేరు చేసి, పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. యూజర్ చార్జీలను సక్రమంగా చెల్లించి, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను అగ్రగామిగా నిలిపేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, చిత్రాడ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యుత్ చార్జీలు తగ్గించాలి'

అగనంపూడి: పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ 85వ వార్డు టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి ఆర్‌ఈసీఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ చార్జీలు పెరగడంతో పేదలపై భారం పడిందని వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర ఆరోపించారు. కార్యక్రమంలో కత్తి తిలక్, గంతకోరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'



72వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో పాల్గొన్న వాసు తదితరులు



79వ వార్డు గళ్లవానిపాలెంలో మహిళకు స్టిక్కర్ అందజేస్తున్న మహాలక్ష్మినాయుడు



66వ వార్డులో కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఇమ్రాన్



69వ వార్డు నాతయ్యపాలెంలో ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్న బోగాది సన్యాసిరావు

గాజువాక: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. నియోజకవర్గ పరిధిలోని పలు వార్డుల్లో ఈ కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభించింది.

- ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే తమ భవిష్యత్తు బాగుంటుందని ప్రజలు నమ్ముతున్నారని 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. వారి సంక్షేమాన్ని తెలుసుకుని, ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు.
- 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. క్లస్టర్ ఇన్‌చార్జి రాజాన వెంకటరావు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.
- **అగనంపూడి:** అగనంపూడిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జి.పూర్ణానందశర్మ, గాజువాక మండల జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తమ్మిన చైతన్య, శ్రీహర్ష, సూర్యకుమారి, నెల్లి రత్న, కిన్నెర తదితరులు పాల్గొన్నారు.
- 79వ వార్డు గళ్లవానిపాలెం పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, జేసీఎస్ కన్వీనర్ రామచంద్రరాజు పాల్గొన్నారు. గుర్రం శ్రీను, జెర్రి సమర, మామిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- **అక్కిరెడ్డిపాలెం:** 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ నిర్వహించారు. గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి, జగన్ పరిపాలనపై మహిళల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈటి సురేష్, రెడ్డిపల్లి చిట్టిబాబు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.
- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని 69వ వార్డు నాతయ్యపాలెం, తుంగ్లాం, చుక్కవానిపాలెంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, స్టిక్కర్లను అంటించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.
- **పెదగంట్యాడ:** 64వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సోమవారం ఇంటింటికీ వెళ్లారు. పార్టీ నిర్దేశించిన ఐదు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు పాల్గొన్నారు.
- 65వ వార్డులో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు.
- **కూర్మన్నపాలెం:** 87వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈశ్వరరావు, లక్ష్మి, రమణ, బ్రహ్మణి తదితరులు పాల్గొన్నారు.
- వడ్లపూడి సచివాలయ పరిధిలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. ఆయనకు అండగా ఉందామని కోరారు. ప్రగడ వేణుబాబు, ప్రగడ శ్రీనివాసరావు, చిత్రాడ వెంకటరమణ, ప్రగడ గోవిందరాజులు, దుగ్గపు దానప్పలు పాల్గొన్నారు.
- 88వ వార్డు కాపుజగ్గరాజుపేట సచివాలయ పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.



87వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో పాల్గొన్న కోమటి శ్రీనివాసరావు



64వ వార్డు దిబ్బపాలెంలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ధర్మాల శ్రీను

క్లుప్తంగా

మంచినీటి బోరు ప్రారంభం

పెదగంట్యాడ: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నామని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధి నెహ్రూనగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్.వై. నాయుడు, ప్రసాదరావు, కేబుల్ శ్రీను, మనోజ్, గిరి, లోకేష్, ఆర్‌పీ నాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక



అసోసియేషన్ నూతన కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీ డెవలపర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఎంపికైంది. అధ్యక్షుడిగా ఎ.వీర్రాజు, ఉపాధ్యక్షులుగా కె.మోహనరావు, బి.నరసింహారావు, కె.మురళీధరరావు, కార్యదర్శిగా జి.పార్వతీశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా వై.సన్యాసి నాయుడు, ఎం.మోహనరావు, బి.సత్యన్నారాయణ కోశాధికారిగా ఎ.శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఈసీ మెంబర్లుగా ఈగలపాటి యువశ్రీ, ఐ.సువర్ణ కుమారి, వి.వి.రమణరాజు, వి.రామాచార్యులు, ఇ.సువర్ణరాజు ఎంపికయ్యారు. వీరు రెండు సంవత్సరాల పాటు పదవిలో ఉంటారని తెలిపారు.

రామాలయ వార్షిక వేడుకలు ప్రారంభం



వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

గాజువాక: స్థానిక పాత కర్ణవానిపాలెంలోని సీతారాముల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ పెద్దలు కరణంరెడ్డి నర్సింగరావు, సిరసపల్లి అప్పారావు తెలిపారు.

భెల్ హెచ్‌ఆర్ హెడ్‌కు అభినందనలు



భెల్ ఏజీఎం రాజును అభినందిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్ నూతన ఏజీఎం (హెచ్‌ఆర్ హెడ్) ఎం.వి.ఎస్.ఎస్.రాజును సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. సంస్థ పరిపాలనా భవనంలోని ఆయన చాంబర్‌లో సోమవారం కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు. హెచ్‌ఆర్ మేనేజర్ జి.చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, ఎం.వి.ఎస్.ఎన్.రాజు, ఎన్.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బస్టాప్‌ల వద్ద ఆటోలు నిలపొద్దు'

అగనంపూడి: బస్టాప్‌ల వద్ద ప్రయాణికులకు ఇబ్బంది కల్గించేలా ఆటోలు, ద్విచక్రవాహనాలు నిలపవద్దని ఎస్ఐ మహాలక్ష్మి హెచ్చరించారు. బస్సులకు అడ్డంగా చిల్లర వర్తకులు బళ్లు ఏర్పాటు చేయడం వల్ల జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతుందని పేర్కొన్నారు. అగనంపూడి కూడలిలోని బస్టాప్ వద్ద ఆటో డ్రైవర్లు, చిల్లర వర్తకులతో ఆమె మాట్లాడారు. ఆటోలు, తోపుడు బళ్లు, స్టాల్స్ వల్ల బస్సులు స్టాపుల్లో కాకుండా దూరంగా ఆపుతున్నారని, దీంతో ప్రయాణికులు పరుగులు తీయాల్సి వస్తుందని తెలిపారు. బస్టాప్‌ల వద్ద ఆటంకం లేకుండా సహకరించాలని కోరారు.

వేలంపాట ఖరారు

- మెట్టు దిగిన జీవీఎంసీ అధికారులు
- కల్యాణమండపాలు, చేపల చెరువుల వేలం పూర్తి



వేలంపాట నిర్వహిస్తున్న జెడ్సీ సింహాచలం తదితరులు

గాజువాక: జీవీఎంసీ కల్యాణ మండపాలు, చేపల చెరువుల నిర్వహణకు బహిరంగ వేలం విషయంలో జీవీఎంసీ అధికారులు ఒక మెట్టు దిగారు. దీంతో పాటదారులు ముందుకొచ్చి వేలంలో పాల్గొన్నారు. దీంతో వేలంపాట ఖరారైంది.

- పాతగాజువాక దరి డ్రైవర్స్ కాలనీలో గల ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపానికి నిర్వహించిన వేలం పాటను ఏడాదికి రూ.6.55 లక్షల చొప్పున ఖరారు చేశారు. దీనికి కనీస వేలాన్ని ఏడాదికి రూ.5.50లక్షలుగా నిర్ణయించి వేలం వేయగా అచ్యుతరామయ్య అనే వ్యక్తి పాడుకున్నారు. మూడేళ్ల పాటు ఆయనకు ఈ కాంట్రాక్టు అమలులో ఉంటుంది.
- దేశపాత్రునిపాలెం కల్యాణ మండపానికి నిర్వహించిన వేలం పాటలో ఎం.శివకుమార్ అనే కాంట్రాక్టర్ ఏడాదికి రూ.4.20లక్షల చొప్పున మూడేళ్లకు పాడుకున్నారు.
- దేశపాత్రునిపాలెం చేపల చెరువును బాబూరావు అనే వ్యక్తి ఏడాదికి రూ.42వేల చొప్పున పాడుకున్నారు. కాంట్రాక్టరు పాడుకున్న మొత్తంపై 18 శాతం జీఎస్‌టీ, 2.5శాతం సెస్ చెల్లించాల్సి ఉంటుందని జెడ్సీ పి.సింహాచలం పేర్కొన్నారు.

ధర తగ్గించిన అధికారులు

ఈ వేలం పాట విషయంలో జీవీఎంసీ అధికారులు మెట్టు దిగాల్సి వచ్చింది. ఈ నెల 4న నిర్వహించిన వేలంపాటలో ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపానికి కనీస వేలం ధర రూ.7.50లక్షలుగా, దేశపాత్రునిపాలెం కల్యాణ మండపానికి కనీస వేలం ధర రూ.5.50లక్షలుగా నిర్ణయించిన అధికారులు, పాడుకున్నవారు ప్రతి సంవత్సరం ధరను 10 శాతం పెంచాల్సి వస్తుందని చెప్పిన విషయం తెలిసిందే. దీంతో వేలంపాటకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఆ మరుసటి రోజుకు వాయిదా వేసినప్పటికీ కాంట్రాక్టర్లు పాడలేమని తేల్చి చెప్పేశారు. ఈ కారణంగా అధికారులు మెట్టుదిగి కనీస పాట మొత్తాన్ని బాగా తగ్గించుకోవడంతో పాటు ప్రతి ఏటా పెరుగుతుందన్న 10శాతం ధరను కూడా రద్దు చేయడంతో వేలంపాట పూర్తయింది.

పేదల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం



లబ్ధిదారుకు అందిన పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: రాష్ట్రంలో పేద ప్రజలందరి సుఖశాంతులు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 70వ వార్డులో సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులను సోమవారం ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరికీ న్యాయం చేయడం కోసం ముఖ్యమంత్రి సంక్షేమానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన్ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఉరుకూటి చందు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, నాయకులు పాలఘాట్ కృష్ణ, నీలకంఠం, పుల్లయ్య, రాములమ్మ, రవణమ్మ, కోటి, పల్లా రమణ, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను మభ్యపెడుతున్న గుర్తింపు సంఘం'



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక వర్గాన్ని గుర్తింపు సంఘం, యాజమాన్యాలు మభ్యపెడుతున్నాయని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో హామీలు ఇచ్చిన ఏఐటీయూసీ గెలిచిన తర్వాత ఇదిగో, అదిగో అంటు కాలయాపన చేస్తోందన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి తేవడంలో గుర్తింపు యూనియన్ పూర్తిగా విఫలమైందన్నారు. ఉత్పత్తికి తగ్గ ఇన్సెంటివ్ ఇప్పించలేకపోతున్నారన్నారు. వేతన సవరణ, సిబ్బంది భర్తీ, ఇన్సెంటివ్ తదితర అంశాలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదన్నారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, బీఎంకె నాయక్, గొందేశి ప్రభాకరరెడ్డి, సుదర్శనం, గోపాలరాజు, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి చేయూత



బియ్యం, సరకులు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

అగనంపూడి: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇంటికే పరిమితమైన అగనంపూడి నిర్వాసిత కాలనీ పినడమడకు చెందిన ఆటో డ్రైవర్ జామి సన్యాసిరావు కుటుంబానికి సద్భావనా సేవా సంఘం చేయూతనందించింది. నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరకులను అందించింది. సద్భావనా సేవా సంఘం కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జి.పూర్ణానందశర్మ ఆర్థిక సహకారంతో వీటిని అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న అగనంపూడి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు దాసరి సన్యాసిరావు ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.రెండు వేల నగదును సహాయంగా అందించారు. కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, ప్రజా సంఘాల నాయకులు కిడిమి హనుమంతురావు, బలిరెడ్డి సత్యనారాయణ, ఎం.మస్తాన్‌రెడ్డి, కె.గోవిందమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు

అక్కిరెడ్డిపాలెం, మిందిల్లో నిర్వహణ



నడవలేని స్థితిలో ఉన్న రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రామకృష్ణ



అక్కిరెడ్డిపాలెం సచివాలయం వద్ద వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు రామకృష్ణ, ప్రియాంక

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది ప్రాంతాల్లో గాజువాక పీహెచ్‌సీ వైద్యుడు వై.రామకృష్ణ నేతృత్వంలో సోమవారం నిర్వహించారు. ముందుగా అక్కిరెడ్డిపాలెం సచివాలయం వద్ద అక్కిరెడ్డిపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఎ.ప్రియాంకతో కలిసి 110 మందికి వైద్యసేవలు అందించారు. నడవలేని స్థితిలో ఉన్న సత్యాల జువ్వాలు (76) అనే వృద్ధుడి ఇంటికి డాక్టర్ రామకృష్ణ వెళ్లి, వైద్యపరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులను అందజేశారు. అనంతరం అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌కు చేరుకుని చిన్నారులను పరిశీలించారు. పలువురు చిన్నారులు బలహీనంగా ఉండటంతో గుడ్లు, పోషకాహారం సరిగా అందజేస్తున్నారా అని అంగన్‌వాడీ కార్యకర్తను ఆరా తీశారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ఆరోగ్య సూచనలు అందించారు.

- మింది సచివాలయం వద్ద డాక్టర్ వై.రామకృష్ణ, సిబ్బందితో కలిసి 96 మందికి సేవలు అందించారు. గ్రామంలో అనారోగ్యంతో ఉన్న మహిళకు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో టి.నాగప్పారావు, ఎంపీహెచ్‌వో ఎస్.ఎస్.వి.ఎస్.రాజు, పీహెచ్ఎన్ వై.లక్ష్మి, హెచ్‌వీ జగదీశ్వరి, సచివాలయం ఏఎన్ఎం మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వర్ణ పుష్పార్చన

డాబాగార్డెన్స్: విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ వర్గాలు తెలిపాయి.